## క్లుప్తంగా

### ఆర్డీఓకు వీడ్కోలు



ఆర్డీఓ సుజనను సత్కరిస్తున్న సిబ్బంది

నగరి: బదిలీపై వెళ్తున్న ఆర్డీఓ సుజనకు కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నగరి ఆర్డీఓ కార్యాలయానికి తొలి ఆర్డీఓగా రీసర్వే ప్రక్రియ, ఓటర్ల జాబితా సిద్ధం చేయడం తదితర అంశాలపై ఆమె పని తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఓ, డీటీ, డీఐఓ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### కాలభైరవుడికి చందన అలంకరణ



చందన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కాలభైరవ స్వామి

నగరి: స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామి సన్నిధిలో శనివారం విశేష అష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేక, అర్చనలు జరిగాయి. పాలు, పెరుగు, పంచామృతం, చందనం, విబూది, పన్నీరు, కొబ్బరి నీళ్ల మొదలగు వాటితో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం చందనలంకరణ చేయగా భక్తులను ఆకట్టుకుంది. పూజలో పాల్గొన్న భక్తులకు, ఆలయ నిర్వాహకులు చందనం, పసుపు, విబూదిని ప్రసాదంగా అందజేశారు.

### నాన్నారం కథల పుస్తకావిష్కరణ



పుస్కకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

నారాయణవనం: నారాయణవనం సంస్కృతిని ఉట్టిపడేలా ఆర్‌సి కృష్ణస్వామి రాజు రచించిన నాన్నారం కథల పుస్తకాన్ని శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సులోచన అధ్యక్షతన ఆవిష్కరించారు. కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ తెలుగు, తమిళ సంస్కృతుల మిళితమైన నారాయణవనం వాసుల వ్యావహారిక భాషతో రాసిన కథలు అందరినీ ఆకట్టుకుంటాయన్నారు. తెలుగు ప్రాచీన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ కథల స్తుకాలు మంచి పౌరులను తీర్చిదిద్దుతాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలల పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ బాల సాహిత్యం వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ ఆచార్యులు యువశ్రీ, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత నాగరాజు, రచయిత వీఆర్ రాసాని తదితరులు నాన్నారం పుస్తకంలోని 30 కథలను సమీక్షించారు.

### వెంకన్న తిరునామాలకు ప్రత్యేక పూజలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలోని తిరునామాలకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. వెంకటేశ్వరస్వామి తిరునామాళ్లకు అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. ఉదయం నుండి భజనలు చేశారు.

### ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా హరహర తీర్థంలోని పురాతన శివాలయ పునర్నిర్మాణ పనులను శనివారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న శివాలయాన్ని పూర్తిగా తొలగించి పునర్నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులను వేగవంతం చేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లోపు కుంభాభిషేకం నిర్వహించాలని అధికారులకు సూచించారు. నూతన శివలింగం, నందీశ్వరుడు విగ్రహాలను వెంటనే తెప్పించి జలవాసం, దానవాసంలో పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి భక్తులు వచ్చే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# కానరాని పూత.. రైతన్నకు వెత



పుత్తూరులో పూతలేని మామిడి తోట



కేబీఆర్‌పురంలో తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి

- పూతలు లేని మామిడి తోటలు
- డిసెంబర్‌లో కురిసిన వర్షాలే కారణం
- ఫిబ్రవరి రెండోవారంలో రావచ్చంటున్న అధికారులు

పుత్తూరు: మాములుగా ఈ సమయంలో మామిడి పూతతో చెట్లు కళకళలాడుతూ కనిపించాల్సిన సమయం. కానీ ఎక్కడా మచ్చుకైనా పూత కనిపించడం లేదు. దీంతో మామిడి తోటలపై ఆధారపడి బతుకుతున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఏదో ఒక ఉపద్రవంతో తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అలాగే ఏటా డిసెంబర్‌లో పూత ప్రారంభమై జనవరి నెలాఖరుకు దాదాపు 70 శాతం పూతతో చెట్లు కళకళలాడుతూ కనిపించాలి. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనవరి నెలాఖరు వచ్చినా అయినా కనీసం 10 శాతం పూత సైతం కానరాని దుస్థితి నెలకొంది. తోటల్లో పర్యటించిన ఉద్యానవన శాఖ అధికారులు తోటల్లో తేమశాతం ఇంకా ఉండడంతో పాటు, కొన్ని తోటల్లో దిగబడే పరిస్థితిని గుర్తించారు. పూత పట్టే సమయానికి తోటలు బెట్టగా ఉండాలి. అయితే డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా తోటల్లో నేటికీ తేమశాతం ఉన్న కారణంగానే పూత రాలేదని అధికారులు నిర్ధారణకు వచ్చారు. రైతులు సూచనలను పాటించడం ద్వారా ఫిబ్రవరి రెండోవారానికి పూత వచ్చే అవకాశం ఉందని ఉద్యానవన శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

**మల్టీ–కే స్ప్రే చేయండి..**



మామిడి పూత రావడానికి తోటల్లో మల్టీ–కే (13:0:45) 10 గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి, అలాగే ఫార్ములా 4 లేదా 5 గ్రాములను ఒక లీటరు నీటితో కలిపి రెండింటినీ ఒకటిగా పిచికారీ చేయాలి. ఇలా చేయడం ద్వారా తోటల్లో తేమ శాతం తగ్గి 15 రోజుల్లో పూత వచ్చే అవకాశాలు ఉన్నాయి. –వెంకటసౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి, పుత్తూరు

## భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



మట్టిని వేరు చేసే విధానాన్ని చార్టులో వేసి చూపిస్తున్న వ్యవసాయ అధికారి డిల్లీప్రసాద్

పాలసముద్రం: రైతులు పంట సాగు చేసే ముందు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయడం వల్ల అటు భూమికి, ఇటు పంటకు శ్రీరామరక్ష నిలుస్తుందని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. శనివారం శ్రీకావేరి రాజుపురం పంచాయతీ చెరువు ముందర కండ్రిగ గ్రామంలో రైతులకు భూసార పరీక్ష చేయడం వల్ల వచ్చే లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఏఓ మాట్లాడుతూ భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష తప్పనిసరిగా చేయాలన్నారు. పంట సాగు చేసే ముందు ప్రతి రైతు దీనిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పంట కోతలు ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించి, భూసార పరీక్ష వల్ల ఏ పంట సాగు చేయవచ్చో తెలుస్తుందన్నారు. భూసార పరీక్ష ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రభుత్వం భూసార పరీక్షలు చేసి రైతులకు కార్డులు అందించే కార్యక్రమం చేపట్టిందన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. అనంతరం రైతులకు మట్టిని వేరు విధానాన్ని చార్టులో బొమ్మ వేసి వివరించారు. కార్యక్రమంలో ఆర్బీకే సహాయకులు వనజ, వలంటీర్లు, రెతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు విధిగా పాటించాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్

పుత్తూరు: ట్రాఫిక్ నియమాలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ సూచించారు. గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారి నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మోటార్ సైకిల్ నడిపే వారు విధిగా హెల్మెట్ వినియోగించాలని చెప్పారు. ఇతర వాహనాలు నడిపే వారు సీట్ బెల్ట్‌ను ధరించాలన్నారు. అనంతరం స్థానిక నగరం రోడ్డు కూడలి వద్ద బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటమోహన్, ఆటో యూనియన్ నాయకులు ఖాసీంబాషా, శ్రీనివాస్, టూవీలర్ డీలర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

### డిప్యూటీ సీఎంతో యువజన విభాగం నేతలు

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తగా మూడోసారి నియమితులైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఢిల్లీకుమార్, మండల వైస్ ఎంపీపీ హరిబాబుతో కలిసి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిని శాలువా, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. జిల్లా యువజన విభాగం సంయుక్త కార్యదర్శి దామోదరం, సోషల్ మీడియా మండల కన్వీనర్ మదన్ పాల్గొన్నారు.

### అలరించిన మాస్టర్ చెఫ్ ప్రోగ్రాం



మాస్టర్‌చెఫ్ ప్రోగ్రాంలో విద్యార్థులు

నగరి: రూరల్ మండలం నంబాకం మండల ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డేను పురస్కరించుకుని మాస్టర్ చెఫ్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులంతా చెఫ్ వేషధారణలో వంటకాలను రుచిచూసే చెఫ్‌లుగా వ్యవహరించడం అందరినీ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు వనితాకుమార్, పాండురంగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు చెఫ్‌ల గురించి వివరించారు.

### నేడు సర్వసభ్య సమావేశం

పాలసముద్రం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నేడు సాధారణ సమావేశం జరుగుతుందని ఎంపీపీ శ్యామల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులకు కావలసిన పనుల జాబితా తేవాలని తెలిపారు.

# జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- పెత్తందార్లకు, పేదలకు మధ్యనే వచ్చే ఎన్నికలు
- చంద్రబాబుతో చేతులు కలిపిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బాబు అండ్ కో విష ప్రచారం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పెనుమూరు: సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయం ఆవరణలో సిద్ధం పోస్టర్లను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి పదంలో దూసుకుపోతుందని గుర్తు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేక ప్రతిపక్ష చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కొందరు మేధావులు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలని కోరారని, కానీ పేద పిల్లలు ఇంగ్లిష్ చదవడం ఓర్వని బాబు వాటిని పెడ చెవిన పెట్టాడని ఆరోపించారు. నేడు జగనన్న ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టి ప్రతి పేద విద్యార్థి కూడా ఆంగ్ల మాధ్యమంలో రాణించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని భావించారని తెలిపారు. బాబు నిత్యం పెత్తందారుల వైపేనని, జగనన్న నిత్యం పేదల కోసం పోరాటం చేస్తున్నారని వివరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలసి సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, పండరీనాథ్, దాము, కృష్ణారెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, దూదిమోహన్, దూది మునేంద్ర పాల్గొన్నారు.



జీడీనెల్లూరు: సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**పాలసముద్రంలో..**

పాలసముద్రం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటిస్తే నిజం, చంద్రబాబు అంటే అబద్ధం, మోసాలు, కుట్రలు, వెన్నుపోటు రాక్షసుడని రాష్ట్ర ప్రజలకు తెలిసిన నిజం.. అలాంటి చంద్రబాబు, ఆయన పార్టనర్ పవన్‌కల్యాణ్‌తో ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల చేతులు కలిపినట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్పీటీసీ అన్నశగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం పంచుకుని పుట్టిన సొంత అన్న జగన్‌ను కాదని షర్మిల శత్రువులతో చేతులు కలిపి ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నిస్తోందని తెలిపారు. ఎంతమంది ఏకమైనా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని, ప్రజలు ఆయన పక్షాన ఉన్నారని తెలిపారు. తనను నమ్మి మూడవసారి కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని, పార్టీ కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా పని చేసి వైఎస్సార్‌సీపీ గెలుపు జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యశోదారెడ్డి, పోలయ్య, పెనుమూరు మార్కెటింగ్ డైరెక్టర్ రమాదేవి, వైస్ ఎంపీపీ పుష్ప, ఎంపీటీసీ గోవిందరాజ్, లిఖిత, సర్పంచ్‌లు గాలి మహేష్, అయ్యప్పన్, అనురేఖ, జీవిత, అరుల్, చిన్నపయ్యన్ పాల్గొన్నారు.

**పార్టీ గెలుపే ప్రతి ఒక్కరి లక్ష్యం**

గంగాధర నెల్లూరు: పేద ప్రజల కోసం ప్రతి నిత్యం పరితపించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమరెడ్డి, సర్పంచ్ మునిరాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు పుష్పగుచ్ఛాలతో డిప్యూటీ సీఎం నారాయణస్వామిని సత్కరించారు.

## వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి



కార్వేటినగరం: మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- నేను ఎవరికీ విరోధిని కాదు
- ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను మానుకోవాలి
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: పేదలకు సంక్షేమాలు అందించి ఆర్థికంగా, రాజకీయంగా సమానత్వాన్ని తీసుకొస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు. శనివారం నియోజకవర్గంలో నిర్వహించిన సుడిగాలి పర్యటనలో భాగంగా కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రాజకీయంలో అన్ని సామాజిక వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో జరగాల్సిన మరిన్ని అభివృద్ధిని పూర్తి చేయడానికే తనకు మూడోసారి కూడా ఎమ్మెల్యే టికెట్ కేటాయించి ఆశీర్వదించారని తెలిపారు. తాను ఎవరికీ విరోధిని కాదని.. అందరితో సఖ్యతగా ఉంటున్నా, ప్రజల నుంచి వేరు చేసేందుకు ఎల్లో మీడియాలు కంకణం కట్టుకుని విషప్రచారం చేస్తున్నాయని, ఇది మంచిది కాదన్నారు. ఎన్ని జన్మలెత్తినా సీఎం జగనన్నకు, నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనని అన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున మంత్రిని శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, ధనశేఖర్‌వర్మ, రామ్మూర్తి, సుబ్రమణ్యం, చందురాజు, గోపి, మురగయ్య, దొరబాబు, విజయకుమార్, సుందర్‌రాజ్, వెంకటేష్, వెంకటరత్నం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

- పుత్తూరు సీనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో మార్చి 9న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. శనివారం జడ్జి మీడియాతో మాట్లాడుతూ అత్యధిక కేసుల పరిష్కారానికి పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ చేయాలని సూచించారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీమార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమం అని, దీనిపై అప్పీల్ వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్

వెదురుకుప్పం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయ పరిధిలోని మర్రిమాకుల కండ్రిగ గ్రామానికి చెందిన 9 మంది పేదలకు శనివారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. గ్రామంలో గతంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తెచ్చారు. వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాతూ ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి నీడ కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. పేదల తలరాతలను మార్చిన సీఎం జగనన్నేనని త్వరలో వచ్చే ఎన్నికల్లో జగనన్ను అందరూ ఆశీర్వదించాలని కోరారు. లబ్ధిదారులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్, డీడీఓ సుబ్రమణ్యం, వీఆర్‌ఓ శశికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### తిరుచ్చిపై శ్రీవారి ప్రసన్నం



శ్రీవారి ఊరేగింపు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి ఏకాంతసేవ నిర్వహించారు.

### టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవిరాజు

నగరి: టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా పంపిణీ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు ఆదేశించారు. శనివారం నగరి, సత్రవాడలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్లలో ప్రధానమంత్రి టీబీ విముక్త్ భారత్ అభియాన్ పథకం కింద టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. అనంతరం నగరి ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడుతున్నవారు చల్లటి నీరు తాగరాదని, చల్లటి వాతావరణంలో ఉండరాదని సూచించారు. ఏరియా ఆస్పత్రిలో సెక్సువల్ స్కానింగ్ నిర్వహించరాదన్నారు. పట్టణ పరిధిలో అనధికారిక వైద్యశాలలు నడిపితే తప్పనిసరిగా వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.